# బాధ్యత

"ఏవండీ! బాబుని పంపించొద్దండీ.." వేడుకోలుగా అంది సుమలత.

అలా అంటూంటే ఆమె గొంతు జీరబోయింది. ముఖం కళ తప్పింది.

"ఏవిటి సుమా! చిన్నపిల్లలా ఈ మొండిపట్టు. ఎవరైనా చూస్తే నవ్విపోతారు" అన్నాడు రాజశేఖర్.

"నేను వాడి కన్నతల్లినండీ" అంది.

"ఏం? నేను మాత్రం కన్నతండ్రిని కానా!" అన్నాడు గట్టిగా.

ఊరుకుంది నిశ్శబ్దంగా.

"అయినా తల్లిగా నా కంటే కూడా వాడంటే నీకు అమిత ప్రేమ. అనురాగం ఉండొచ్చు. కాదనను. మనలో వాడంటే ఎవరికి మమకారం ఎక్కువో, తక్కువో ఇప్పుడేం పోటీ పెట్టట్లేదు. వాడి భవిష్యత్ గురించి ఆలోచించాల్సిన సమయమిది" అనునయంగా అన్నాడతను.

"మనకి దూరంగా ఎక్కడికో బాబుని పంపి చదివిస్తేనే వాడి భవిష్యత్ బ్రహ్మాండంగా వుంటుందా? ఏం మన కళ్ళముందుంటే చదవలేడా? ఇదెక్కడి విడ్డూరమండీ!" బుగ్గనొక్కుకుందామె.

"నీ మాటలే చిత్రంగా వున్నాయి. ఎక్కడికో దూరంగా అంటే చంద్రమండలానికి పంపిస్తున్నామా... గురుగ్రహానికి వెళ్తున్నాడనుకున్నావా. గుంటూరు కేగా!" ముఖంలో చికాకు

వ్యక్తమవుదుంటే విసుగ్గా అన్నాడు.

మూతి ముడుచుకుందామె.

"ఎప్పుడు చూడాలనుకుంటే అప్పుడు వెళ్ళి బాబుని చూసి రావొచ్చని చెప్పాగా. ఊరికే నసపెడతావెందుకు? మహా అయితే మన జగిత్యాల నుండి గుంటూరు ఒక్కరోజు ప్రయాణం" చెప్పాడతను.

"ఎంతమంది పేరెంట్స్ తమ పిల్లల్ని అంతదూరం పంపించి చదివిస్తున్నారు చెప్పండి?" ఎదురు ప్రశ్నించింది భర్తని.

"ఎవరి గురించో మనకెందుకు చెప్పు. మన పిల్లవాడి బాగోగులు మనం ఆలోచించుకోవాలి గానీ" సాధ్యమైనంత మృదుత్వం ప్రదర్శించాడు మాటల్లో.

"మీరెన్నయినా చెప్పండి. బాబుని వదిలి నేనొక్కక్షణం ఉండలేను." తేల్చి చెప్పేసింది.

"నీ మూర్ఖపు పట్టుదల నీదే! చెప్పేది అస్సలు పట్టించుకోవు" అసహనంగా అన్నాడు.

సమాధానంగా ముఖం పక్కకు తిప్పుకుంది.

"వాడింకా పాలుతాగే పసివాడేం కాదు. టెన్త్ పాసయ్యాడు. తల్లిదండ్రుల్ని అంటిపెట్టుకుని తిరిగే స్టేజ్ దాటిన టీనేజ్‌కుర్రాడు." సీరియస్‌నెస్ చోటు చేసుకుందతనిలో.

"అదే నా కిష్టం లేదు. అయినా ఆ ఇంటర్మీడియటేదో ఇక్కడే చదివించండి. మన జగిత్యాల చిన్న పల్లెటూరేం కాదుగా, ట్యూషన్స్ కూడా పెట్టించండి. అంతే కానీ, రెండవ ఆలోచన చేయటానికి ససేమిరా వీల్లేదు." కరాఖండిగా చెప్పేసింది.

"నీవనేది వాస్తవమే. అలా కూడా చేయొచ్చు. కానీ సుమా! ఇక్కడున్న కాలేజీల్లో ఎమ్‌సెట్ కోచింగ్ ఇవ్వడం లేదు. అయితే ఈమధ్యే ఒక కోచింగ్ సెంటర్ ఓపెన్ చేశారు. కోచింగ్ మెరుగైన స్థాయిలో ఉండకపోవచ్చు." భార్యకి విడమరచి చెప్పాడు.

బదులు పలుకలేదామె.

కొన్నిక్షణాలు గడిచాయి.

"ప్లీజ్! నన్ను విసిగించకండి. వద్దు వద్దన్నా విన్పించుకోకుండా నాలుగు విషయాలు తెలుస్తాయి. విజ్ఞానం పెరుగుతుంది. అంటూ ఆరోజు కూడా ఇలాగే పెద్దబాబుని ఎక్స్‌కర్షన్‌కి పంపించారు. ఏం జరిగింది ? మన కన్న పేగుని తన పొట్టన పెట్టుకుందా ఎక్స్‌కర్షన్."

సుమలత స్వరస్థాయి తగ్గింది. గొంతులో తడిచేరింది.

"ఏవండీ! గుండెలో వాడి జ్ఞాపకాల తడి ఇంకా ఆరనేలేదు. కనీసం వీడినైనా నా కనుసన్నల్లో మెలగనీయండి."

ఆమె కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయ్.

అది చూసి కాస్త వెనక్కి తగ్గాడు రాజశేఖర్.

ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళి నాగార్జునసాగర్‌లో పడి మృతి చెందిన కొడుకు గుర్తుకు వచ్చి

ఆమె కుమిలిపోతుంటే... కాసేపు నిశ్శబ్దమై పోయాడతను. ఆ విషాదం నుండి ఇపుడిపుడే కోలుకుంటోందామె.

రెండు నిమిషాలు భారంగా గడిచాయి.

భార్య అలా విలపిస్తుంటే బాధగా ఫీలయ్యాడు రాజశేఖర్.

'సరే... ఆమె మనసు నొప్పించడం దేనికి? ఆమె ఇష్ట ప్రకారం బాబుని ఇక్కడే ఏదో కాలేజీలో జాయిన్ చేస్తే సరిపోతుంది.' అని నిశ్చయించుకుని మౌనం వహించాడతను.

పని మనిషికోసం అదేపనిగా గుమ్మం వైపు తొంగి చూస్తోంది సుమలత.

సాయంత్రం అయిదవుతోంది.

రోజూ ఆ సమయానికి పనంతా ముగించేసుకుని వెళ్ళిపోవాల్సిందే. కానీ ఎందుకో ఈ రోజింకా రానేలేదు. రానని చెప్పలేదు.

సుమ ఆలోచిస్తుండగానే గేటు తీసుకొని లోపలికి హడావుడిగా వచ్చేసింది పనిమనిషి రాములమ్మ.

"ఏం రాములమ్మా... ఎన్నడూ లేనిది ఈరోజు ఇంత ఆలస్యంగావచ్చావేం?" సంజాయిషీ కోరుతున్నట్లుగా కాకుండా నవ్వుతూ ప్రశ్నించింది.

"రోజుట్లాగే బయల్దేరినానమ్మా! మీ ఈది సివరింట్లో జనాలు మూగితే ఏందని పోయిన. ఆ ఇంట్ల ముసల్దిసచ్చిందట. సెవం సూసిన గదా, ఇటత్తె మంచిగుండదని మల్ల ఇంటికిపోయి తానం చేసొత్తున్నా" బదులిచ్చింది రాములమ్మ.

"ప్రొద్దున బట్టలారేయడానికి డాబా పైకెళితే చాలా జనం కన్పించారక్కడ. ఏంటీ అంతమంది పోగయ్యారనుకున్నా. అదా విషయం. మరా శవాన్ని ఇంతక్రితం చూసానన్నావ్. ఇంకా దహన సంస్కారాలవలేదా?" ఆసక్తిగా అడిగింది.

"యాడైనయమ్మా! ఆ ముసల్దానికి ఒక్కడే పోరడట. అద్దుర బిడ్డా అని ఆ తల్లి ఎంత మొత్తుకున్నా దుబాయ్‌కి పోయిండట. ముసల్దాని తిండి కోసం తాపకిన్ని పైసలైతే పంపుతున్నాడటగానీ అయిదేండ్ల నుంచి మాత్రం పత్తకు లేడట. కన్నకొడుకు దగ్గర్లేని రందికే ముసల్ది సగం సచ్చింది. రోగంతో ఇయ్యాల పూర్తిగా సచ్చిపోయింది." తాను తెలుసుకున్న విషయాలన్నీ ఏకరువు పెట్టిందా పనిమనిషి.

"మరి కొడుక్కి ఫోన్ చేశారా?"

"ఉన్నపళంగా రమ్మంటే ఏడ కుదురుద్ది. సేయాల్సిన పన్లేవో సెయ్యండి. ఖర్చులకి పైసల్ పంపిత్తానన్నాడట."

రాములమ్మ చెబుతున్నది విని, స్టన్నయి పోయిందా సుమలత.

"కన్నతల్లి చనిపోతే కన్నకొడుకు రానన్నాడా? కనీసం కడచూపుకైనా రావాలన్పించలేదా? ఇదేం పేగుబంధం? తల్లి దహనసంస్కారాలు పూర్తిచేయడం కొడుగ్గా అతని బాధ్యత కాదా?"

సుమ మనసంతా నైరాశ్యంతో నిండిపోయింది.

సుమకి చప్పున భర్త మాటలు గుర్తుకు వచ్చాయా సమయంలో.

"కొడుకు మీద అంత అనుబంధం పెంచుకుంటున్నావ్. రేపు వాడు పెరిగి. పెద్దవాడై ఉద్యోగం రీత్యానో మరో కారణం చేతనో నీకు దూరంగా వుండిపోతాడు. అప్పుడు కూడా వాడు నిన్ను అంటిపెట్టుకునే ఉండాలని కోరుకుంటావా? పిచ్చి సుమా! పిల్లల మీద తల్లిదండ్రులు వాత్సల్యం పెంచుకోవడం తప్పేమీ కాదు. కానీ వాళ్ళ నుండి తిరిగి అదే రీతిలో ప్రేమాభిమానాల్ని ఆదరణని ఆశించడం మాత్రం ఈ రోజుల్లో స్వార్థమే అవుతుంది. ఎందుకంటే అవి దక్కనినాడు నీకు నిరాశే మిగులుతుంది.

పరిస్థితుల ప్రభావం వల్లరేపు నీ కొడుకు నీ మాటకి విలువనీయక పోవచ్చు. ఎదురు మాట్లాడొచ్చు. అప్పుడు తట్టుకోగలవా? అందుకే సుమా! ఇప్పటి నుండైనా బాబుకి దూరంగా ఉండేలా అలవాటుచేసుకో. లేకపోతే మున్ముందు నీ గుండె భరించలేదు. నీ మనసేంటో నాకు బాగా తెలుసు."

భర్త మాటలు మనసు పొరల్లో ప్రతిధ్వనిస్తుంటే సుమ అంతరంగాన్ని శూన్యం ఆవరించింది.

యజమానురాలి వాలకం చూసి ఆశ్చర్యపోయింది రాములమ్మ.

"ఆదేందమ్మా! ముసల్దాని గురించి సెబితే నువ్వలా కొయ్యబారిపోయావు" అనడిగిందామె.

సుమ ఆలోచన్లనుండి తేరుకుందా మాటకి.

"ఏం లేదు రాములమ్మా! అంత కష్టపడి గుండెల్లో పెట్టుకుని పెంచిన కన్నకొడుకు చచ్చిశవమైనా చూడ్డానికి రాలేదంటే ఆ ముసల్దెంత దురదృష్టవంతురాలో చూడు. అన్నీవుండి చివరికి దిక్కులేని దానిలా పడివుంది..." అంది నిర్లిప్తంగా.

రాములమ్మ దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచింది.

"కడుపు తీసి అందరిదీ ఒకటే అయినా ఎవడి కడుపుకోత ఎట్టాగుంటుందో ఎవరికెరుకమ్మా?" అంది లోపలికి వెళుతూ.

మళ్ళీ ఆలోచన్లు చుట్టుముద్దాయి సుమని.

భర్త మాటలు గుర్తుకు రాసాగాయి మళ్ళీ.

"పిల్లల్ని తీర్చిదిద్ది ప్రయోజకుల్ని చేయడం వరకే తల్లిదండ్రులుగా మనవంతు బాధ్యత. అందుకే సుమా... మన బాధ్యతల్ని మనం నిర్వర్తించాలి. ఆ తర్వాత వాళ్ళ జీవితం వాళ్ళిష్టం. ఇది జీవిత సత్యం."

'నిజమే! తల్లిగా నా బాధ్యతని విస్మరించకూడదు. అబ్బాయిని పంపేందుకు ఒప్పుకోవాలి.' అనుకొని తన నిర్ణయం చెప్పడానికి భర్త కోసం ఎదురు చూడసాగింది సుమలత.